అన్ని వర్గాలకు సర్కార్ అండ



జనగామ: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జమున



నర్మెట: చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గోవర్ధన్

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పి. జమునలింగయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబాలకు ఆమె కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డల వివాహానికి కట్నకానుకల కింద రూ.1,01,116 అందజేస్తూ కేసీఆర్ పెద్దన్నగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, ఫ్లోర్‌లీడర్ మారబోయిన పాండు, కౌన్సిలర్ ఎండీ.సమ్మద్, కోఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, ప్రవీణ్, దేవునూరి సతీష్, ఉడుగుల నర్సింహులుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత కేసీఆర్

నర్మెట: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం కేసీఆర్ అభివృద్ధి ప్రదాతగా నిలిచారని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా 11 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచ్ కమలాకర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ ఎండీ. గౌస్, ఎంపీడీఓ ఎండీ. ఖాజామొయినొద్దీన్ డీటి రాజేష్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆగిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పరశురాములు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'కంటి వెలుగు' వైద్యసిబ్బందికి చీరల పంపిణీ



జనగామ: పట్టణంలోని ఏడో వార్డులో ఐదు రోజులుగా ప్రజలకు కంటి పరీక్షలు చేసి ఉత్తమ సేవలు అందించిన మహిళా వైద్య సిబ్బందికి సత్కారం చేశారు. వైద్య శిబిరం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మల్లవరపు అరవింద్ రెడ్డి, కేశిరెడ్డిపల్లి సర్పంచ్ దివ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్, వైద్య సిబ్బంది, ఆశ, ఆర్పీ తదితర మహిళలకు కౌన్సిలర్ మల్లవరపు అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో చీరలు అందించి, వారి సేవలను కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆశించిన మేర ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేసి, రీడింగ్ అద్దాలు అందించారని తెలిపారు. సైట్ అద్దాలు అవసరం ఉన్నవారికి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసినట్లు, మరో 15 రోజుల్లో అవి కూడా పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వార్డు ప్రముఖులు రాజ్ కుమార్, సాజిద్ పాష తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు, మండలంలోని నాగిరెడ్డిపల్లిలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుందని మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి తెలిపారు. బుధవారం పలు కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది అంధత్వంతో బాధపడుతున్నారని, వారి ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, తాటిరెడ్డి భవాని, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



యాదగిరి (ఫైల్)

జనగామ రూరల్: పట్టణానికి చెందిన జైన యాదగిరి అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా కుమారుడు జైన రమేష్ తండ్రి నేత్రాలను దానం చేశారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో కళ్లను సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపినట్లు వారు తెలిపారు. లయన్ గంగి శెట్టి ప్రమోద్‌కుమార్, గోపయ్య, కృష్ణ జీవన్ బజాజ్, ఉప్పలయ్య, చిదులరాల బాబు, అంజయ్య, సంజీవ, జయహరి, అశోక్, వేణు ఉన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటు అభినందనీయం



జనగామ రూరల్: పట్టణంలోని ఏసీరెడ్డినగర్ డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్, చైర్మన్ పోకల జమునకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా ప్రాంగణాన్ని వినియోగించుకోవాలని అన్నారు. బూడిద గోపి, విజేందర్, సత్తయ్య, ప్రమీల, అనిత, రవి. నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

పాలకుర్తి టౌన్: హాథ్ సే హాథ్ జోడో యాత్రపై పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన అధ్యక్షుడు చక్రాల రఘు రాసి, పాడిన సీడీని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం మహబూబాబాద్‌జిల్లాలోని ఈదుల పూసలపల్లిలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా రఘు మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో తన పాటలు పార్టీ బలోపేతం కోసం దోహదపడుతాయని అన్నారు.

షర్మిలపై కడియం వ్యాఖ్యలు హాస్యాస్పదం

● వైఎస్సార్ టీపీ రాష్ట్ర నాయకురాలు సాహితి

స్టేషన్‌ఘన్‌పూర్: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని పార్టీ రాష్ట్ర నాయకురాలు సాహితి అన్నారు. బుధవారం ఆమె డివిజన్ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్ షర్మిల పాదయాత్ర ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రవేశించిన నేపథ్యంలో 'సమైక్య ఆంధ్రప్రదేశ్‌ను సమర్థించిన షర్మిలకు తెలంగాణలో పాదయాత్ర చేసే అర్హత లేదని' కడియం శ్రీహరి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కడియం శ్రీహరి తెలుగుదేశం పార్టీలో ఉన్నది వాస్తవం కాదా.. ప్రస్తుతం రాష్ట్ర క్యాబినెట్‌లో తెలంగాణ వ్యతిరేకులు మంత్రులుగా ఉండగా వారితో మీరు అంటకాగుతున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు రావనే బెంగతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతుండగా వారికోసం షర్మిల నిరాహార దీక్షలు చేసిన తర్వాతే ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసిందని గుర్తు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వేలాది కిలోమీటర్ల పాదయాత్ర చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్న షర్మిలను విమర్శించే అర్హత కడియంకు లేదని, స్థాయిని దిగజార్చుకోవద్దని హితవు పలికారు.

ఆలయ వార్షికోత్సవం



జనగామ రూరల్: పట్టణంలోని పాతబీటుబజార్ రామలింగేశ్వరస్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయమే ఆలయానికి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప శాస్త్రి, సిద్ధాంతి శ్రీకృష్ణమాచార్య ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, అష్టోత్తర శతనామావలి, 108 కలశపూజ, రుద్రహోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. దేవాలయ చైర్మన్ రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు హరిశ్చంద్ర గుప్త, శ్రీనివాస్, అల్లాడి ప్రభాకర్, టి.బాలాచారి, రమేష్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బచ్చన్నపేట: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన పురాణం సతీష్ కుటుంబ సభ్యులకు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య పంపించిన బియ్యాన్ని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అల్వాల ఎల్లయ్య బుధవారం అందజేశారు. మహిపాల్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, నర్సిరెడ్డి, వేణువందన, బుచ్చిరాజు, హరి పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్

చిల్పూర్: మండల కేంద్రంలో నేడు(గురువారం) నిర్వహించే జీఎంపీఎస్ మండల మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల కార్యదర్శి ఆవుల ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని లింగంపల్లిలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని గంగాదేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే మూడో మహాసభకు గొల్లకురుమ సహకార సంఘం బాధ్యులు తదితరులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అపరాదపు రాజు, రాజు, సంపత్, మల్లేష్, వీరస్వామి, వెంకటమల్లు, శ్యాం, రాజ్‌కుమార్, ఎల్లయ్య, భిక్షపతి, రాజు, కొంరయ్య, కోటి పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని గృహోపయోగ విద్యుత్ మీటర్లను బుధవారం విద్యుత్ సిబ్బంది సామూహికంగా తనిఖీలు నిర్వహించారు. దేవరుప్పుల సెక్షన్ ఏడీ తిలక్ ఆధ్వర్యంలో లింగాలఘణపురం, సింగరాజుపల్లి, దేవరుప్పుల మండలాలకు చెందిన ఏఈలు శంకరయ్య, రాజవర్ధన్‌రెడ్డి, సుధాకర్, ఫోర్‌మెన్లు, లైన్‌మెన్స్, ఏఎల్ఎం, జేఎల్ఎంలు తనిఖీల్లో పాల్గొన్నారు.

చెరువు తూముకు మరమ్మతులు చేపట్టాలి



తూమును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి పంగిడి చెరువు తూముకు మరమ్మతులు చేపట్టి సాగు నీరు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరాజు, మండల కార్యదర్శి రంగాపురం మహేందర్ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తూమును పరిశీలించిన అనంతరం మాట్లాడారు. అశ్వరావుపల్లిలో రిజర్వాయర్ కాకముందు చెరువుకు చిన్నతూము ఉండేదని అన్నారు. రిజర్వాయర్ అయ్యాక పాత పద్ధతిలో కాకుండా పైపులు వేయడం, ఆ పనులు సక్రమంగా చేపట్టక పోవడంతో రిజర్వాయర్ కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామన్నారు. చక్రపాణి, నర్సయ్య, శ్రీనివాస్, సోమయ్య, సాంబరాజు, నాగరాజు, సిద్దిరాములు, యాకయ్య, కవిత, స్వరూప, ఎల్లమ్మ, రేణుక ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

బచ్చన్నపేట: పట్టణాలకు పల్లెలే పట్టు కొమ్మలని.. ఆ పల్లెల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని మండలంలోని కొన్నె సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ అన్నారు. బుధవారం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు సీఎం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, ఎంపీటీసీ మల్గ నర్సమ్మ, జిల్లా నాయకులు గిరబోయిన అంజయ్య, బావండ్ల కృష్ణంరాజు, మల్గ సిద్దిరాములు, సిద్దారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొడకండ్ల: మండలంలోని రేగుల ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓగా వేర్పుల వరుణ్, హెచ్‌ఎంగా బల్ల వర్ష, ఎస్ఎంసీ చైర్మన్‌గా భూక్య స్వాతి వ్యవహరించగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యా బోధన చేశారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులనుహెచ్‌ఎం మాధవి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకన్న, ఉపాధ్యాయులు జ్యోతి, సుగుణరాణి, మనిత, శ్రీనివాస్ అభినందించారు.

చక్రధర్‌గౌడ్‌ను విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

జఫర్‌గఢ్: తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసిన ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చక్రధర్ గౌడ్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ యువజన, గోపా, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన చక్రధర్‌గౌడ్‌ను రాజకీయంగా ఎదుర్కొలేక మంత్రి హరీశ్‌రావు తప్పుడు కేసుల పెట్టించి అరెస్టు చేయించారన్నారు. వెంటనే చక్రధర్‌ను విడుదల చేయాలని, లేని పక్షంలో గౌడ జాతి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడంతో పాటు డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. నాయకులు పులి శ్రావణ్‌కుమార్‌గౌడ్, బుర్ర తిరుపతిగౌడ్, కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, వడ్లకొండ రాజుగౌడ్, తాళ్లపల్లి సురేష్‌గౌడ్, కొల రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి దిశలో పయనించాలి



విజయ సంకేతం చూపుతున్న మహిళలతో ప్రజాప్రతినిధులు, అధికారులు

దేవరుప్పుల/పాలకుర్తి: స్వయం సమృద్ధి సాధించే దిశగా మహిళలు పయనించి ఆదర్శంగా నిలవాలని డీఆర్‌డీఓ ఏపీడీ నూరొద్దీన్ అన్నారు. బుధవారం దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లోని కడవెండి, సింగరాజుపల్లి, గూడూరు, పాలకుర్తి, చెన్నూరు, వావిలాలల్లో సెర్ప్, స్త్రీనిధి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆయనతోపాటు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ శ్రీమతి పంజా కల్పన కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలుత మహిళా సాధికారత లక్ష్యంలో భాగంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేక చొరవతో పాలకుర్తి నియోజకవర్గంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, తొర్రూరు పట్టణ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జలీల్, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు గోపాలదాస్ మల్లేష్, పోతిరెడ్డి బెట్లీనా, మంద కొంరయ్య, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం

జనగామ రూరల్: పట్టణంలోని భూనీలా గోదాదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు శ్రీభాష్యం నర్సింహాచార్యులు, వెంకటాద్రి, పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

దేవరుప్పుల: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందన పోరండ్ల పుల్లయ్య అనే రైతుకు చెందిన 150 మోపుల గడ్డివామి దగ్ధమైంది. ఈ సంఘటనతో పాడిపశువులకు మేత కరువైందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

యాదవ హక్కుల సంఘం నాయకుల అరెస్ట్



రఘునాథపల్లి: యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అల్లిక వెంకటేశ్వరయాదవ్ ఇచ్చిన పిలుపు మేరకు చలో అసెంబ్లీకి వెళ్తున్న నాయకులను ముందస్తుగా పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కావాటి భాస్కర్, కోటిలింగంలు మాట్లాడుతూ యాదవ సోదరులకు ఇచ్చిన హామీలను అమలు పరుచకుంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సాయం



మాట్లాడుతున్న రమేష్

చిల్పూర్: శివాలయం అభివృద్ధికి దాతల సాయం అభినందనీయమని శ్రీ భక్త మార్కండేయ సేవాసమితి అధ్యక్షుడు కుసుమ రమేష్ అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లోని భక్తమార్కండేయ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శివాలయం పనులను రమేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం గ్రామ అధ్యక్షుడు కుసుమ రవి ఆధ్వర్యంలో కె.రమేష్ రూ. 5 లక్షలు, వనం రమేష్ రూ. 50 వేలు అభివృద్ధి పనుల కోసం విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి మొదటి వారంలో ఆలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, దాతలు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. రామయ్య, రాజేశ్వర్, రాజమౌళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని అమలు చేయండి

పాలకుర్తి: ప్రభుత్వ ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తమ సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని, ఉద్యోగులు 33 నెలల ఫిట్‌మెంట్‌ను నష్టపోయారన్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూ రెండో పీఆర్సీ ఏర్పాటుపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల లోపు ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సల్లంగ చూడు తల్లీ..

చిల్పూరు: సమ్మక్క–సారలమ్మ తల్లీ వచ్చే జాతర వరకు సల్లంగ చూడు అంటూ గద్దెల వద్ద గ్రామస్తులు బుధవారం మొక్కులు చెల్లించారు. జిల్లాలో రెండో జాతరగా పేరొందిన లింగంపల్లిలో ఉదయం సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్, జాతర చైర్మన్ మోతె శ్రీనివాస్ తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

దివ్యాంగులను విస్మరించడం దారుణం

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగులను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించడం దారుణమని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోట సురేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ కేంద్రంలోని ఎన్పీఆర్డీ కార్యాలయంలో మండల గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమార్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో దివ్యాంగులము సైతం 42 రోజుల పాటు పోరాటంలో పాల్గొనగా ప్రభుత్వం ఏర్పడగానే అన్ని విధాల ఆదుకుంటామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని అన్నారు. బడికె కుమారస్వామి, రమాదేవి, శ్రీనివాస్, గోవర్ధన్, వలబోజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సుందర్‌రామిరెడ్డి

దేవరుప్పుల: దేవునిగుట్టతండాలో ధరావత్ పార్వతి కుటుంబానికి రూ.10 వేలు, బంజరలో గుగులోత్ బన్సీ కుటుంబానికి రూ.5 వేల చొప్పున బీఆర్ఎస్ మండల నాయకులు పల్ల సుందర్ రామిరెడ్డి ఆర్థిక సాయం అందించారు. అనంతరం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, బస్వ మల్లేశం, రామ్‌సింగ్, సర్పంచ్‌లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపుపై సందిగ్ధత

● కలెక్టరేట్ ఉద్యోగుల ఆందోళన



కలెక్టరేట్‌లో కోనోకార్పస్ చెట్లు, (ఇన్‌సెట్‌లో) పగిలే దశలో ఉన్న గింజలు

జనగామ: మొక్క నాటిన అనతి కాలంలోనే.. ఏపుగా పెరుగుతూ.. అందంగా కనిపించే కోనోకార్పస్ చెట్లతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని సైంటిస్టుల హెచ్చరికలతో కలెక్టరేట్ ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని డివైడర్లపై నాటిన వందలాది కోనోకార్పస్ మొక్కలను ఇటీవలే తొలగించారు. వాటి స్థానంలో పూల మొక్కలు నాటు తుండగా.. కలెక్టరేట్‌లో ఉన్న ఈ ప్రమాదకర చెట్లనుమాత్రం నేటికీ తొలగించడం లేదు. గ్రౌండ్ ఫ్లోర్‌లో నాటిన మొక్కలు పెరిగి పెద్దవవుతూ మూడో అంతస్తుకు చేరుకుంటున్నాయి. ఈ మొక్కల గింజలు ప్రమాదమని చెబుతున్నారు. గింజలు వేసవిలో పగిలిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో వాటి నుంచి వచ్చే వాసనతో శ్వాస సంబంధిత వ్యాధులు ప్రబలుతాయని ఉద్యోగులు భయపడుతున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంతో పాటు చుట్టూ ఉన్న కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించి అధికారులు, ఉద్యోగుల, సిబ్బందితో పాటు అనేక పనుల కోసం ఇక్కడకు వచ్చే ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ చెట్లను తొలగించాలనే డిమాండ్ పెరుగుతోంది.

కేసు నమోదు చేయాలి



పాలకుర్తి టౌన్: దేవాదాయ శాఖ ఖమ్మం ఇన్‌స్పెక్టర్ సమతను బెదిరింపులకు పాల్పడి, ఆమె ఆత్మహత్యాయత్నానికి పురిగొల్పిన ఖమ్మం బీఆర్ఎస్ రూరల్ అధ్యక్షుడు బెల్లం వేణుపై క్రిమినల్ కేసునమోదు చేయాలని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అర్చక, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవీఆర్‌శర్మ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఒక వైపు దేవాలయాలు, అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తుంటే, కొందరు అధికార పార్టీ చోటా మోటా నాయకులు వారిపై భౌతికదారుడు చేస్తున్నారని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో ఆలయ ఈఓ నండూరి రజనీకుమారి, ఆలయ అర్చకులు దేవగిరి రామన్న, లక్ష్మన్న, అనీల్‌కుమార్, సిబ్బంది రాములు, శ్రీనివాస్, నర్సింహరావు, అశోక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.